సాక్షి అనకాపల్లి
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



కేజీహెచ్ మార్చురీ వద్ద బాధితుల ఆర్తనాదాలు



అంతులేని ఆక్రందన

వారిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి ఈ ఏడాదే పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఓ బిడ్డకు జన్మనివ్వబోతోన్న ఆ దంపతులు భవిష్యత్తును ఊహించుకుంటూ పొందిన ఆనందానికి అంతేలేదు. వారి ఆనందాన్ని చూసి మృత్యువుకూ కన్నుకుట్టింది. ఫార్మా ప్రమాదం రూపంలో భర్తను కాటేసింది. తమ బిడ్డ భూమిపైకి రాకముందే భర్త(చిరంజీవి)ను పోగొట్టుకున్న ఆ ఇల్లాలి (లీలాదేవి) వేదన వర్ణనాతీతం. కేజీహెచ్ మార్చురీ వద్ద భర్త నుంచి పొందిన ప్రేమను తలచుకుంటూ, అతను చేసిన బాసలు గుర్తు చేసుకుంటూ విలపిస్తుంటే.. యముడు మనసు మార్చుకునైనా ఆమె భర్త ప్రాణాల్ని తిరిగిస్తే బాగుండు కదా.. అని కోరుకోని వారు లేరంటే అతిశయోక్తి కాదు.

న్యూస్‌రీల్

నేడు అనకాపల్లికి మాజీ సీఎం జగన్ రాక



విశాఖ సిటీ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లికి రానున్నారు. ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి విమానంలో బయలుదేరి 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11.20కు అనకాపల్లిలో ఉన్న ఉషా ప్రైమ్ హాస్పిటల్‌కు వెళతారు. అక్కడ ఎసైన్షియా కంపెనీ ప్రమాద బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.30కు అక్కడి నుంచి బయలుదేరి 1.30కి విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి బెంగళూరు పయనమవుతారు.

క్షతగాత్రులను పరామర్శించిన కృష్ణబాబు



రోగితో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు

అనకాపల్లి: అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రిల్లో రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఆనర్స్



నూతన విద్యార్థుల పద్యపోటీల్లో విజేతకు బహుమతి ప్రదానం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో చేరిన విద్యార్థులు నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సును అందుకునే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ వెల్లడించారు. గురువారం కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం కోర్సులలో చేరిన విద్యార్థులకు కళాశాల కరికులం గురించి వివరించేందుకు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ ఆనర్స్ ఇష్టం లేని యువత మూడేళ్ల కోర్సుతో బయటపడవచ్చన్నారు. డిగ్రీ ఆనర్స్ చేసి మెరిట్ సాధించిన విద్యార్థులు పీజీ కోర్సు రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చని, పీహెచ్‌డీలో వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన పద్య గీతాలాపన పోటీలలో విజేతలకు ఉపన్యాసకుడు ఎ.కృష్ణారావు నగదు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు ఐ.వి.వి.సత్యవతి, డబ్ల్యూఈసీ కో–ఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ, హెచ్‌వోడీలు సూర్యవతి, సిహెచ్.జ్యోతి, టి.రాధాకృష్ణ, మల్లిబాబు, వి.అప్పలనాయుడు, నారాయణమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లు వైద్యం చేయకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

నక్కపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఇకపై స్వీపర్లు వైద్యం చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో స్వీపర్లే సెలైన్ ఎక్కిస్తున్నారంటూ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ ఇటువంటి ఘటనలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. స్వీపర్లు వైద్యం చేయకుండా హెచ్చరించామన్నారు. ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రత.. గాల్లో దీపమే!

- ఫార్మా కంపెనీల్లో భద్రత డొల్ల
- అరకొర పరిజ్ఞానం ఉన్న కార్మికులే నిపుణులు

– 8లో





కన్నీటి సుడులు



ఫార్మా కంపెనీ వద్ద పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : ఫార్మా ప్రమాదపు మృతుల బంధువుల రోదనలతో విశాఖ కేజీహెచ్, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి పరిసరాలు మిన్నంటాయి. ఎటు చూసినా తమ ఆత్మీయుల్ని కోల్పోయిన కుటుంబ సభ్యుల వేదనలే. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో మృత్యు ఒడికి చేరిన తమవారిని కడసారి చూసుకునేందుకు గంటల తరబడి నోచుకోక నరకయాతన అనుభవించారు. తమవారి మృతదేహాలు ఎక్కడున్నాయో.. ఎవరిని సంప్రదించాలో తెలీక.. శవాగారం వద్ద.. జాగారమే చేశారు.బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం రాత్రి 10 గంటల వరకూ మార్చురీల వద్ద పడిగాపులు కాశారు. వారికి కనీస ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం అణువణువునా కనిపించింది. భర్తను కోల్పోయిన గర్భిణీ ఏడుస్తూ, నీరసించిపోయినా కేజీహెచ్ సిబ్బంది కన్నెత్తి చూడలేదు.



మృతుల బంధువులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు

తీరని వేదన.. ఏదీ సాంత్వన

- ఘటనా స్థలంలో హృదయ విదారక దృశ్యాలు
- ఇప్పటికీ అలాగే శరీర అవశేషాలు
- పూర్తి కాని శిథిలాల తొలగింపు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఆస్పత్రుల్లో క్షతగాత్రుల అరణ్యరోదన
- అనకాపల్లి, విశాఖ ఆస్పత్రుల్లో చికిత్స
- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు

సాక్షి, అనకాపల్లి: ఘోర ప్రమాదానికి వేదికగా నిలిచిన అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణంలో.. హృదయ విదారక దృశ్యాలెన్నో గుండెను మెలిపెడుతున్నాయి. రియాక్టర్ పేలి 24 గంటలైనా ఘటనా స్థలంలో శరీర అవశేషాలు చెట్టు కొమ్మకు వేలాడుతూనే ఉన్నాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సభ్యులు రెండో రోజు గురువారం సాయంత్రం వరకు క్రేన్‌లతో భవన శిథిలాలు తొలగిస్తూనే ఉన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గల మెడికవర్, ఉషా ప్రైమ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను.. వారి పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఇప్పటికీ ఫ్యాక్టరీ పరిసరాల్లో రసాయనాల వాసన పోలేదు. కంపెనీ చుట్టూ దట్టమైన పొగలతో నల్లని మబ్బులు కమ్మినట్లుగా ఉంది.

కంపెనీ ముందు మృతుల బంధువుల పడిగాపులు

మృతుల బంధువులు గురువారం వేకువజాము నుంచే ఎసైన్షియా కంపెనీ వద్దకు చేరుకున్నారు.



మృతుని బంధువుల ఆర్తనాదాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చేవరకూ వారు వేచి ఉన్నారు. వర్షంలో కూడా తడిసే అక్కడ ఆర్తనాదాలతో పడిగాపులు కాశారు. మృతి చెందినట్లు తమకు అధికారులు గానీ, కంపెనీ యాజమాన్యం గానీ సమాచారం ఇవ్వలేదని.. కనీసం స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కల్పించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించేందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తాను అండగా ఉంటానని చెప్పినా తమకు నమ్మకం లేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబును కలిసేందుకు ప్రయత్నించినా.. ఆయన వచ్చిన కంపెనీ వెనక మార్గం వైపు వీరిని అనుమతించలేదు. దీంతో కంపెనీ ముందే సాయంత్రం వరకూ పడిగాపులు కాశారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు

గురువారం యలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఆయన కుమారుడు సుకుమార్ వర్మ ప్రమాద స్థలం వద్దకు వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సాయంత్రం 5 గంటల సమయంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి తదితరులు వచ్చి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాద ఘటనపై సీఎం సమీక్ష

అచ్యుతాపురం ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ బ్లాక్‌లో బుధవారం జరిగిన ప్రమాదాన్ని పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గురువారం మధ్యాహ్నం 2.34 గంటలకు హెలికాప్టర్ ద్వారా అచ్యుతాపురం సెజ్‌కు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన బ్లాకులను సందర్శించారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా పరిశ్రమల అధికారిలతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఘటన జరిగిన క్రమాన్ని మ్యాప్ ద్వారా ముఖ్యమంత్రికి కలెక్టర్, ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రతినిధులు వివరించారు. అనంతరం హోం మంత్రి అనిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక పాటిల్, విశాఖపట్నం సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశం అనంతరం సాయంత్రం 5.25 గంటలకు ఫార్మా కంపెనీ నుంచి హెలికాప్టర్‌లో ఎయిర్ పోర్టుకు బయలుదేరారు.

డ్యూటీకి వెళ్లిన పావుగంటలోనే..



పూడి మోహన్‌ను నేను పెంచుకుంటున్నాను. వాడి వయస్సు 20 ఏళ్లు. వాళ్ల అన్నయ్య నాని ఎసైన్షియా కంపెనీలోనే ఏడాదిగా పనిచేస్తున్నాడు. అతని రిఫరెన్స్‌తో రెండు నెలల కిందటే మోహన్ జాబ్‌లో చేరాడు. నిన్న మొదటి షిఫ్ట్‌లో అన్నయ్య నాని డ్యూటీ అయిపోగా.. తమ్ముడికి వెళ్తొస్తానని చెప్పి వచ్చేశాడు. రెండో షిఫ్ట్‌కు వెళ్లిన మోహన్ పావుగంటలోనే రియాక్టర్ పేలి చనిపోయాడు. అధికారులు కనీస సమాచారం ఇవ్వలేదు.

– దేవి, మృతుడు పూడి మోహన్ పిన్ని, మోటూరుపాలెం

చనిపోయినట్లు సమాచారం ఇవ్వలేదు



రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన వేగి సన్యాసినాయుడు ప్రమాదంలో చనిపోయి 24 గంటలవుతున్నా ఇప్పటివరకూ మాకు సమాచారమే ఇవ్వలేదు. ఆయన ఇద్దరు కుమార్తెలు కొయలాడ వసంతి, మళ్ల కవిత అనాథలయ్యారు. నిన్న ప్రమాదం జరిగినట్టు టీవీల్లో చూసి వెంటనే వచ్చాం. ఏ ఆస్పత్రిలో ఉన్నారో కూడా చెప్పలేదు. మేమే కేజీహెచ్‌కు మృతదేహం వచ్చినట్టు తెలుసుకున్నాం.

– మృతుడు వేగి సన్యాసినాయుడు బంధువులు, మూలజంప గ్రామం, రాంబిల్లి మండలం

భర్త లేడన్న నిజం ఉదయం వరకూ చెప్పలేదు..



పరిశ్రమ గేటు వద్ద యల్లబిల్లి లోవమ్మ

ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో యల్లబిల్లి చిన్నారావు(34) మరణించిన విషయం ఆయన భార్య లోవమ్మకు బంధువులు, చుట్టుపక్కల వారు గురువారం ఉదయం వరకూ చెప్పలేకపోయారు. లోవమ్మ తీవ్రమైన మూర్ఛరోగంతో బాధపడుతోంది. ఆమెకు నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చవుతోంది. చిన్నారావు, లోవమ్మ దంపతులకు ఏడేళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం పరిశ్రమలో పెయింటర్‌గా పనిచేస్తున్న చిన్నారావు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. ఈ విషయం అతడి భార్యకు ఎలా చెప్పాలో తెలియక బంధువులు, ఇరుగుపొరుగు వారు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు చెప్పి ఆమెను ఓదార్చారు. చివరకు గురువారం ఉదయం ఆమె కు విషయం చెప్పారు. పరిశ్రమ ముఖ ద్వారం వద్ద దీనంగా ఉన్న ఆమెను పలువురు మీడియా ప్రతినిధులు అడిగినా, తన భర్త ఏమయ్యాడో పూర్తిగా చెప్పలేని దయనీయ స్థితిలో ఉండటం పలువురి హృదయాలను ద్రవింపజేసింది.

కేజీహెచ్ మార్చురీ వద్ద హైడ్రామా



ఫార్మా మృతుల బంధువులతో కేజీహెచ్ మార్చురీ పరిసరాలు

మహారాణిపేట: ఫార్మా ఘటనకు సంబంధించి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణలో గురువారం మధ్యాహ్నం వరకు హైడ్రామా నెలకొంది. బుధవారం రాత్రి 12 మృతదేహాలను కేజీహెచ్‌కు తీసుకురావడం తెలిసిందే. గురువారం ఉదయం విశాఖ కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ మార్చురీ వద్దకు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందజేస్తామన్నారు. అయితే ప్రకటించిన నష్టపరిహారానికి అనకాపల్లి కలెక్టర్ లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని మృతుల బంధువులు ఆయనకు స్పష్టం చేశారు. ఎలాంటి నష్ట పరిహారం ప్రకటించకుండా, కంపెనీ వాళ్లు రాకుండా ఎలా పంచనామాకు సంతకాలు పెడతామని నిరాకరించారు. కంపెనీ ఉద్యోగి చనిపోతే ఎలాంటి సమాచారం లేదని, యాజమాన్యం ఇప్పటికీ రాలేదని, తాము ఎవరిని నమ్మాలని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి ఎమ్మెల్యే, అనకాపల్లి ఎంపీ రాకపోవడంపై బాధితులు మండిపడ్డారు. రెవెన్యూ, పోలీసులు, కేజీహెచ్ సిబ్బంది మృతుల బంధువులకు ఎంతగానో నచ్చజెప్పేందుకు యత్నించినప్పటికీ.. ఫలితం లేకపోయింది. అంతా తాము చూసుకుంటామని బతిమలాడినా వారు ఒప్పు కోలేదు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెవెన్యూ, పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నించారు. ఇంతలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు మార్చురీ వద్దకు వచ్చి.. ఇంకా శవపంచనామా చేయకపోవడంపై ప్రశ్నించడంతో కదలిక వచ్చింది. అప్పటికి రెండు పంచనామాలు పూర్తి చేసి, మూడో పంచనామాకు శ్రీకారం చుట్టారు. ఛిన్నా భిన్నమైన మృతదేహాలకు సంబంధించిన బంధువులను రప్పించి.. రాత్రికి ప్రక్రియ పూర్తి చేశారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాల ఆందోళన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబాలు, సీపీఎం, సిటు నాయకులు

అనకాపల్లి : ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో చనిపోయిన ఐదుగురి మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఎన్టీఆర్ ఆస్పత్రి పోస్టుమార్టం రూమ్ వద్ద ప్రభుత్వానికి, ఫార్మా కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా బాధిత కుటుంబాల వారు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, సంఘటన జరిగి 24 గంటలు దాటినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టమైన ప్రకటన రాకపోవడం అన్యాయమని అన్నారు. కాలం చెల్లిన ఫార్మా కంపెనీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబానికి రూ.కోటి చెల్లించాలని, నష్టపరిహారం చెల్లింపుపై లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చురీ నుంచి ఎన్టీఆర్ ఆస్పత్రి బయటకు వెళుతున్న సమయంలో ఆస్పత్రి గేటు వద్ద పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తమ సిబ్బందితో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మృతుల కుటుంబానికి కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చురీ వద్ద ప్రభుత్వ అధికారులు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇంత ఘోరం జరిగినప్పటికీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించకపోవడం దారుణమన్నారు. ఆందోళనలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, ఆర్.శంకరరావు, రాజు, అప్పారావు, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరిహారం ప్రకటించడం కాదు..అందించాలి

- ఎల్‌జీ పాలిమర్స్ తరహాలో అందరికీ అందించాలి
- ఘటనా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్సీ బొత్స, మాజీ మంత్రులు



ఉషాప్రైమ్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

సాక్షి, అనకాపల్లి/ తుమ్మపాల: ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించడమే కాదు, వెంటనే అందించాలని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ప్రమాదం జరిగిన స్థలాన్ని, క్షతగాత్రులు చికిత్స పొందుతున్న అనకాపల్లిలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిని ఆయన మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ సత్యవతిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి చేరుకుని, ఉషాప్రైమ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తారని తెలిపారు. ఫార్మా కంపెనీలో ఇంత పెద్ద ప్రమాదం జరిగితే స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి స్పందించిన తీరు దారుణమని బొత్స ఆక్షేపించారు. ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో క్షతగాత్రులతో పాటు వారి కుటంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నుంచి నేటి వరకు కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ఘటన జరిగిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడడం సబబు కాదన్నారు. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న వ్యక్తి అధ్యక్షతన నిపుణుల కమిటీ కంపెనీలను పర్యవేక్షించారని అన్నారు. సేఫ్టీ ఆడిట్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాజకీయ విమర్శలు మాని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మలసాల రమణారావు, దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకీరామరాజు, మళ్ల బుల్లిబాబు పాల్గొన్నారు.

'స్థాయి'కి మించి మంతనాలు

- బదిలీపై వెళుతున్న అధికారితో టీడీపీ నేత రహస్య సమావేశం
- జీవీఎంసీలో కాంట్రాక్టర్లు, వారి నుంచి తీసుకోవాల్సిన కమీషన్లపై ఆరా

విశాఖ సిటీ: టీడీపీలో ఓ కీలక నేత బరితెగించాడు. 'స్థాయి'కి మించి ప్రవర్తిస్తున్నాడు. జీవీఎంసీలో కాంట్రాక్టర్లు, వారిని ఎలా, ఎంత వరకు కొల్లగొట్టాలని ఆలోచన చేస్తున్నాడు. దీని కోసం జీవీఎంసీ నుంచి బదిలీపై వెళుతున్న అధికారితో రహస్య మంతనాలు జరిపాడు. ఇప్పుడు జీవీఎంసీలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో కూటమి పార్టీలు కుట్రలు చేసి పది స్థానాలను దక్కించుకున్నాయి. ఈ స్థాయీ సంఘాన్ని అడ్డుపెట్టుకొని రూ.కోట్లు సంపాదించేందుకు ఎవరి వ్యూహాల్లో వారు నిమగ్నమై ఉన్నారు. అయితే ఈ స్టాండింగ్ కమిటీకి సంబంధం లేని టీడీపీలో ఓ కీలక నేత.. వీరికి చెక్ పెట్టి మొత్తం నొక్కేయడానికి పథక రచన చేస్తున్నాడు. జీవీఎంసీ పరిధిలో అత్యధిక పనులు, కాంట్రాక్టులను స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదించి వాటి ద్వారా కమీషన్లు కొట్టేయాలని కొండంత ఆశతో ఉన్నాడు. స్టాండింగ్ కమిటీతో సంబంధం లేకపోయినప్పటికీ.. తన పలుకుబడిని ఉపయోగించి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు నొక్కేయాలని భావిస్తున్నాడు.

అధికారితో రహస్య చర్చలు

దీనిపై ఒక అధికారితో రహస్య మంతనాలు జరిపినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటివరకు స్థాయీ సంఘంపైన, జీవీఎంసీ కాంట్రాక్టర్ల విషయంపై పెద్దగా అవగాహన లేని ఈ కీలక నేత ప్రస్తుతం వారిపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగా జీవీఎంసీ నుంచి బదిలీపై వెళుతున్న ఒక అధికారిని పిలిపించుకొని రహస్యంగా సమావేశమయ్యాడు. జీవీఎంసీ పరిధిలో ఎంత మంది కాంట్రాక్టులు ఉన్నారు? ప్రస్తుతం ఎవరు ఎటువంటి కాంట్రాక్టులు చేస్తున్నారు? ఎవరి నుంచి ఎంత వరకు కమీషన్ల రూపంలో తీసుకోవచ్చు అన్న విషయాలపై సదరు అధికారి ద్వారా ఆరా తీసినట్లు తెలిసింది. స్టాండింగ్ కమిటీలో ఆమోదించే పనులలో సైతం తన పలుకుబడి ఉపయోగించి ఎంత వరకు కమీషన్లు తీసుకోవాలన్న విషయాన్ని అధికారితో చర్చించినట్లు తెలిసింది. స్థాయీ సంఘ సభ్యుడు కాకపోయినప్పటికీ అటు నుంచి కూడా భారీగా సంపాదించాలని గట్టి నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు స్టాండింగ్ కమిటీ సభ్యులు సదరు నేతపై గుర్రుగా ఉన్నట్లు అతడి సన్నిహితుల మధ్య చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ

నర్సీపట్నం: లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ, సిబ్బందితో కలిసి పట్టణంలో పలు ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. యూరియా బస్తాలు నిర్దేశించిన ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించటం, ఫాస్పేట్ ఎరువుల బస్తా నికర బరువు కంటే తక్కువగా ఉండడంతో ఓ దుకాణ యజమానిపై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వినియోగదారులు, రైతులు ఎరువుల బస్తాలను కొనుగోలు చేసేటప్పుడు విధిగా ధరను చూసి కొనుగోలు చేసి, తూకం సరిపోయిందో? లేదో సరి చూసుకోవాలని సూచించారు.

అల్లూరి జేసీ ఘెరావ్



బాధితులతో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా జేసీ అభిషేక్ గౌడ్

అనకాపల్లి: సీఎం పర్యటన నేపథ్యంలో ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీ వద్దకు స్పెషల డ్యూటీపై వచ్చిన అల్లూరి జిల్లా జేసీ అభిషేక్‌గౌడ్‌ను మృతుల కుటుంబ సభ్యులు గురువారం మధ్యాహ్నం అడ్డుకున్నారు. ప్రమాదం జరిగి 24 గంటలు అవుతున్నప్పటికీ మృతుల కుటుంబ సభ్యులకు అటు ప్రభుత్వంగానీ, ఇటు జిల్లా అధికార యంత్రాంగం గానీ సమాచారం ఇవ్వకపోవడం అన్యాయమని, పత్రికలు, టీవీల్లో చూసి వచ్చామని వారు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని, పోస్టుమార్టం అయిన మృతదేహాలను తీసుకుని వెళ్లాలని జేసీ నచ్చచెప్పే ప్రయత్నం చేయడంతో బాధితులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే రూ.కోటి చెల్లించాలని, ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలపాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో ఉన్న ఐదుగురిలో నలుగురు కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నామని, మృతుడు ఎం.సురేంద్ర కుటుంబం అకౌంట్ సరిగా లేదని జేసీ చెప్పారు.

భద్రత.. గాల్లో దీపమే.!

- ఫార్మా కంపెనీల్లో భద్రత డొల్ల
- బ్యాంకు రుణాలు, లైసెన్స్ రెన్యువల్స్ కోసమే సేఫ్టీ ఆడిట్స్
- అరకొర పరిజ్ఞానం ఉన్న కార్మికులే నిపుణులు
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా పట్టించుకోని యంత్రాంగం

సాక్షి, విశాఖపట్నం: పరిశ్రమల్లో భద్రత ప్రశ్నార్థకమైంది. రియాక్టర్లు బాంబుల్లా పేలుతున్నాయి. పైప్‌లైన్లు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇంటికి చేరడం దైవాధీనంగా మారింది. రియాక్టర్ల ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో యాజమాన్యాలు విఫలం కావడంతో.. తదనంతరం జరిగే పరిణామాలకు కార్మికులు బలైపోతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ సేవలూ గగనంగా మారాయి. ఇంత ఘోరమైన పరిస్థితులున్నా జిల్లా యంత్రాంగం పట్టనట్టే ఉంది. ప్రమాదకరమైన పరిశ్రమలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి.. లోపాలు సవరించాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారు.

రియాక్టర్ల తనిఖీలెక్కడ?

ప్రతీ పరిశ్రమను తరచూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ, ఫైర్ సేఫ్టీ అధికారులు పరిశీలించాలి. అప్పుడప్పుడూ ప్రమాదాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా పరిశీలిస్తున్నారే తప్ప.. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన రియాక్టర్లను పరిశీలించిన పరిస్థితులు కనిపించడం లేదు. చాలా సందర్భాల్లో కాలం చెల్లిన రియాక్టర్లే పేలిపోతున్నాయని గతంలో ప్రమాదాలు జరిగినప్పుడు వేసిన కమిటీలు హెచ్చరించాయి. ఇది తెలిసీ కూడా అనేక కంపెనీల్లో కాలం చెల్లిన రియాక్టర్లను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయినా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ యంత్రాంగం వీటి జోలికి వెళ్లడం లేదు. వేల లీటర్ల రసాయనాలు ఉండే రియాక్టర్లు పేలుతుంటే.. దానిని అరికట్టేందుకు సరైన వ్యవస్థలు దాదాపుగా ఏ ఫ్యాక్టరీలోనూ కనిపించడం లేదు.



పరిశ్రమల్లో 'చితి'కి పోతున్నారు

ఉన్న ఊళ్లో ఉపాధి లేక.. పొట్టచేత పట్టుకుని వస్తున్న కార్మికులు పరిశ్రమల్లో చితికిపోతున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి వేరే మార్గం లేక అరకొర సౌకర్యాల మధ్యే బతుకులీడుస్తున్నారు. వారి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి కల్పించాల్సిన సౌకర్యాల పట్ల ఫార్మా యజమానులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో కార్మికుల నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

లోపభూయిష్టంగా భద్రతా చర్యలు

ఫార్మా కంపెనీల్లో భద్రతా చర్యలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరవాడ ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. రసాయన వాయువులు లీక్ కావడం, రసాయన ప్రతి చర్యల సమయంలో ఒత్తిడి పెరిగిపోయి పైపులైన్లు పగిలిపోవడం, రియాక్టర్లు పేలి పోవడం వంటి సంఘటనల్లో పలువురు ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగానూ పలు పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యర్థ రసాయనాలు వెళ్లే పైప్‌లైన్ సక్రమంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యాలతో పాటు అధికారులు పర్యవేక్షించాలి. వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసే పైప్‌లైన్ ద్వారా బయటకు పంపాల్సి ఉన్నప్పటికీ.. పలు కంపెనీలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

అంబులెన్స్ సేవలూ గగనమే..

అచ్యుతాపురం సెజ్‌లో 208 పరిశ్రమలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి పరిశ్రమకు ప్రత్యేకంగా ఫైర్‌సేఫ్టీ బృందం ఉండాలి. ఓ అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ తప్పనిసరి. ఫైరింజన్ లేకపోతే మంటలు ఆర్పే అత్యాధునిక వ్యవస్థలు ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. అచ్యుతాపురం సెజ్‌లోని కంపెనీల వద్ద మాత్రమే సొంత ఫైర్ ఇంజిన్ ఉంది. అంబులెన్స్‌ల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఇక పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం కమిటీ వేయడం, ఆ తర్వాత కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగిపోతుంది. కానీ.. ఆ నివేదికలను ఎప్పుడూ బయటపెట్టిన పరిస్థితులు గానీ, ఆ రిపోర్టులకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

నిపుణులున్నారా?

ఇక కంపెనీల్లో రియాక్టర్లు పేలినప్పుడు నియంత్రించే నిపుణులు ఉండాలి. అయితే అధిక శాతం కంపెనీల్లో అరకొర పరిజ్ఞానం ఉన్న వారే ఉండటంతో.. ప్రమాద సమయాల్లో రియాక్టర్లను నియంత్రించడం కష్టంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. యాజమన్యాలు సబ్ కాంట్రాక్టర్లకు పరిశ్రమల నిర్వహణ అప్పగిస్తున్నాయి. సబ్ కాంట్రాక్టర్లు నైపుణ్యం లేని కార్మికులను తక్కువ వేతనాలతో నియమించుకుని ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇక భద్రత గురించి ప్రశ్నించే కార్మికులను యాజమాన్యాలు నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగిస్తున్నాయి. దీంతో కార్మికులు భయంతో ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది.

అవసరాల కోసమే ఆడిట్లు

ఐఎస్‌ఓ 14489 (1998) ప్రకారం ప్రతీ పరిశ్రమ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి.. ఆ నివేదికను డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు సమర్పించాలి. ఈ ఆడిట్‌ను ఏటా ప్రతీ పరిశ్రమ చేయించుకోవాలి. ఫైర్ సేఫ్టీ, కార్మికుల భద్రత, పర్యావరణ కాలుష్యంతోపాటు పైపులు, రియాక్టర్లు, ట్యాంకర్లు, ఇతర పనిముట్ల జీవిత కాలం, ప్రస్తుతం అవి ఎలాంటి స్థితిలో ఉన్నాయి? అనే అంశాలను ఆడిట్‌లో భాగంగా చెక్ చేయాలి. కానీ చాలా కంపెనీలను పరిశీలించకుండానే నివేదికలు సిద్ధమైపోతున్నాయి. నిజానికి ఇండస్ట్రీయల్ యాక్ట్ ప్రకారం చేసే సేఫ్టీ ఆడిట్‌లో ఏ కంపెనీ పాస్ కాదు. ఆ విషయం ప్రభుత్వానికీ తెలుసు. ఫ్యాక్టరీల విస్తరణ, కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటు, లైసెన్స్ రెన్యువల్, బ్యాంకు లోన్స్ తదితర అవసరాల కోసమే అన్నట్లుగా ఆడిట్‌లు జరుగుతున్నాయి. నిపుణులైన ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలతో కూడిన కమిటీతో ఆడిట్లు చేయిస్తే.. పరిశ్రమల్లో ఉన్న పరిస్థితి వెలుగులోకి వస్తుందన్నారు.

వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మెడికవర్ ఆస్పత్రి

- కె.రాంబాబు, రాంబిల్లి
- బి.శివ వెంకటరత్నం, రాంబిల్లి
- వై.మహేష్‌బాబు, మున్సిపడ
- పి.జగదీశ్వరరావు, నక్కపల్లి
- కె.చంద్రశేఖర్, బొబ్బిలి
- పి.దేముడు, బోయపాలెం
- కె.నారాయణరావు , శ్రీకాకుళం

కిమ్స్ ఐకాన్

- డి.శ్రీనివాస్ వర్మ
- జి.ఎస్.వరప్రసాద్‌రాజు
- పి.అరుణ్‌కుమార్

పవన్ సాయి ఆస్పత్రి, కూర్మన్నపాలెం

- జి.సంతోష్, విజయనగరం
- జి.సాయికుమార్, ఎస్.కోట
- జె.ప్రకాశ్, వెపడ

ఆర్కే ఆస్పత్రి, గాజువాక

- జి.చైతన్య

ఉషా ప్రైమ్ ఆస్పత్రి, అనకాపల్లి

- జె.వర్ధన్, జంగాలపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ
- జి.రాజారావు, వెంకటాపురం, రాంబిల్లి మండలం
- బి.నూరిబాబు, వై.లోవ, రాంబిల్లి మండలం
- ఎం.కిరణ్ సత్యనారాయణ, శ్రీనగర్, గాజువాక
- డి.అప్పారావు, యలమంచిలి
- ప్రభాత్‌యాదవ్, హన్మకొండ, వరంగల్,
- బంగారు చందకనాయుడు విజయనగరం
- ఎస్.యామిని, ఉమ్మలాడ, మునగపాక మండలం
- ఎస్.వంశీ, హరిపాలెం, మునగపాక మండలం.
- కె.షణ్ముఖరావు రణస్థలం, శ్రీకాకుళం
- బి.ధనుంజయ్, ఒడిశా
- సిహెచ్.అప్పారావు పంచదార్ల, యలమంచిలి మండలం
- ఆర్.సత్యనారాయణ, ధారపాలెం
- కె.షణ్ముఖరాజు దేశపాత్రునిపాలెం, పరవాడ మండలం
- ఎ.పరమేశ్వరరావు, యలమంచిలి
- బి.రామ్ మహిరాబాబు, సోమలింగపాలెం, యలమంచిలి మండలం
- ఎన్.అప్పారావు, లెవి కాలనీ
- నోట్ల పైడి కల్యాణ్, వాశెట్టిపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ

త్రుటిలో తప్పిన ప్రమాదం

మునగపాక: ఫార్మా ప్రమాదంలో చిక్కుకున్నా కొందరు అదృష్టవశాత్తూ పెద్ద తీవ్రత లేకుండా బయటపడ్డారు. ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరగడం హేమలత, మళ్ల నాగభూషణం మృత్యుంజయులై నిలిచారు. ప్రమాద సమయంలో తనపై బీరువా పడడంతో తాను ప్రాణాలతో బయటపడ్డానని ఎసైన్షియా కంపెనీలో పనిచేస్తున్న హేమలత తెలిపారు. తన కళ్ల ముందే ఘోరం జరిగిపోయిందని, తన పక్కన ఉన్న వ్యక్తిపై పిల్లర్ పడిపోవడంతో అక్కడే చనిపోయాడని వాడ్రాపల్లికి చెందిన పెయింటర్ మళ్ల నాగభూషణం తెలిపారు.




బాధితురాలు హేమలత క్షతగాత్రుడు నాగభూషణం

సీఎం వద్దకు వెళ్లకుండా సిటు నేతల అడ్డగింత



సీఐటీయూ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

యలమంచిలి రూరల్: అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా పరిశ్రమ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఇక్కడ వచ్చిన సీఎం నారా చంద్రబాబునాయుడిని కలిసేందుకు ప్రయత్నించిన సీఐటీయూ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. సీఐటీయూ నేతలు రొంగలి రాము, చింతకాయల శివాజీలతోపాటు బాధిత కుటుంబీకులు, వారి బంధువులు ఉదయం నుంచి పరిశ్రమ ముందు గేటు వద్ద నిరీక్షించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు వెనుక గేటు నుంచి పరిశ్రమను పరిశీలించడానికి వస్తున్నారని తెలియడంతో అటువైపు వెళ్లేందుకు యత్నించగా వారందర్నీ కొద్ది దూరంలోనే పోలీసులు అడ్డుకున్నారు. ఎలాంటి ఆందోళనలు చేయమని, బాధితుల పరిస్థితిని సీఎంకు తెలియజేసే అవకాశం ఇవ్వాలని సీఐటీయూ నేతలు కోరినా అందుకు అంగీకరించలేదు. దీంతో పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ప్రాణాలు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం దారుణమని మండి పడ్డారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సారణికి చోటు



రోలుగుంట: తెలుగులో 140 పాటలు పాడి ప్రతిభ కనబరిచిన నర్సీపట్నంకు చెందిన వెలిచేటి సారిణి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ మేరకు హైదరాబాద్ నుంచి పోస్టల్‌లో ధ్రువపత్రం, పెన్ను, గోల్డ్ మెడల్, గుర్తింపు కార్డును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు పంపించినట్టు సారణి తండ్రి ఉమాశంకర్ తెలిపారు. గీతంలో డిగ్రీ పూర్తి చేసిన సారణికి తొలి నుంచి తెలుగు పాటలపై ఆసక్తి పెంచుకుంది. దీనిలో భాగంగా పాటల సాధన చేసి హైదరాబాద్ స్టార్ మేకర్స్ యాప్‌లో తన 140 తెలుగు పాటలను ఆడియో, వీడియో ద్వారా వినిపించి ప్రతిభ కనబరిచింది. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వాహకులు సమాచారం అందించారని ఉమాశంకర్ తెలిపారు.

హెచ్‌పీసీఎల్ ప్రమాదం తర్వాత ఇదే అతి పెద్ద దుర్ఘటన

యలమంచిలి రూరల్: పచ్చని పల్లెలు విషవాయువుల కాలుష్యంతో నిండిపోతున్నాయి. రసాయనిక పరిశ్రమలు సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉపాధి కోసం పరిశ్రమల్లో పనిచేస్తున్న ఎందరో అభాగ్యులు కంపెనీ యాజమాన్యాల నిర్లక్ష్యానికి బలవుతున్నారు.

2019 నుంచి ఇప్పటి వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక ప్రమాదాలు సంభవించగా 45 మంది మృత్యువాత పడ్డారు. తాజాగా బుధవారం అచ్యుతాపురం ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరో 17 మంది మృతి చెందారు. ఈ ప్రమాదం ఉమ్మడి రాష్ట్రంలోనే అన్ని ప్రమాదాల కంటే పెద్దది కావడం స్థానికులను కలవరపెడుతోంది. 1997లో విశాఖ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది మృతి చెందారు. ఆ తర్వాత బుధవారం తాజాగా జరిగిన ప్రమాదమే అతి పెద్దది.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫ్యాక్టరీ ప్రమాదాలు

- 2019 ఫిబ్రవరి 15: రెడ్డి లేబొరేటరీస్ ప్రమాదంలో ఒకరు మృతి
- 2019 జూలై 15: డీఆర్ రెడ్డి లేబొరేటరీస్: ఒకరు మృతి
- 2019 నవంబరు 20: హెటిరో డ్రగ్స్ : ఒకరు మృతి
- 2019 అక్టోబరు 23: కనోరియా కెమికల్స్ ఒకరు మృతి
- 2019 డిసెంబరు 13: అక్టిస్ జనరిక్స్ ఒకరు మృతి
- 2019 డిసెంబరు 25: విజయ శ్రీ ఆర్గానిక్స్ ఒకరు మృతి
- 2019 డిసెంబరు 26: స్మైలెక్స్ లేబొరేటరీస్: ఒకరు మృతి
- 2020 ఏప్రిల్ 7: హెటిరో ల్యాబ్స్: ఒకరు మృతి
- 2020 జూన్ 29: సైనార్‌లైఫ్ సైన్స్: ఇద్దరు మృతి
- 2020 జూలై 13: విశాఖ సాల్వినెట్: ఇద్దరు మృతి
- 2021 ఏప్రిల్ 12: ఏంజెల్స్ ఫార్మా: ఒకరు మృతి
- 2021 మే 2: సిలికాన్ సైన్స్: ఒకరు మృతి
- 2021జూన్ 24: ఏఆర్ఎస్ ఫార్మా:ఒకరు మృతి
- 2021 జూలై 23: వశిష్ట ఫార్మా: ఒకరు మృతి
- 2021 సెప్టెంబరు 15: మైలన్ లేబొరేటరీస్: ఒకరు మృతి
- 2022 ఫిబ్రవరి 23: హెటిరో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: ఇద్దరు మృతి
- 2022 ఏప్రిల్ 10: డెక్కన్ ఫైన్ కెమికల్: ఒకరు మృతి
- 2022 జూలై 14: విశాఖ ఫార్మాసిటీ (రాంకీ): ఒకరు మృతి
- 2022 అక్టోబర్ 26: లారెస్:ఐదుగురు మృతి
- 2023 మార్చి 14: సెంబయోజనరిక్స్ ఫార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్:ఇద్దరు మృతి
- 2024 ఏప్రిల్ 7: ఎపిటోరియా ఫార్మా ఇండియా:ఇద్దరు మృతి
- 2024 ఏప్రిల్ 7: అల్కలీ మెటల్స్:ఒకరు మృతి
- 2021 జూలై13: రుషి డెకార్స్ డాకర్స్ ప్రమాదంలో ఒకరు మృతి
- 2021 సెప్టెంబరు 21: అభిజిత్ ఫెరోటెక్: ఒకరు మృతి
- 2021 అక్టోబరు 3: పాకర్నా ఇంజనీరింగ్: ఒకరు మృతి
- 2022 జూలై 27: సుందరం అల్లాయిస్: ఒకరు మృతి
- 2022 ఆగస్టు 20: సాగర్ సిమెంట్: ఒకరు మృతి
- 2022 అక్టోబరు 22: సెయింట్ గాబిన్ ఇండస్ట్రీస్: ఒకరు మృతి
- 2022 నవంబరు 20: సుందరం అల్లాయిస్: ఒకరు మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సింహాద్రి(ఫైల్)

నక్కపల్లి: పెదబోదిగల్లం రోడ్డులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరు గాయాలతో బయటపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సీతంపాలేనికి చెందిన అల్లు సింహాద్రి(38) గొర్ల బాబూజీ కలిసి ద్విచక్ర వాహనంపై అడ్డురోడ్డు వెళ్తున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ పైనుంచి పడిపోయారు. సింహాద్రి తలకు బలమైన గాయాలు కాగా.. బాబూజీకి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ హుటాహుటిన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సింహాద్రి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు గొర్ల గోవింద్, గంటా తిరుపతిరావు, సర్పంచ్ తళ్ల భార్గవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్ని, తదితరులు పరామర్శించి, ఓదార్చారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధ్య తరగతి యువకుడి కథే 'సీతారాం సిత్రాలు'

బీచ్‌రోడ్డు: మధ్య తరగతి యువకుడి కథే 'సీతారాం సిత్రాలు'అని ఆ సినిమా హీరో లక్షణ్ అన్నారు. ఆ సినిమా బృందం గురువారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా మీడియాతో హీరో మాట్లాడుతూ చిత్ర ట్రైలర్, టీజర్‌కి మంచి స్పందన వచ్చిందన్నారు. మధ్య తరగతి యువకుడు పట్నం వచ్చిన తర్వాత జరిగే పరిణామాలే ఈ సినిమా అని, ఇందులో హీరోయిన్ భ్రమరాంబిక టీచర్ పాత్రలో నటించారన్నారు. దర్శకుడు నాగ శౌధర్ రెడ్డి మాట్లాడుతూ రుద్ర కిరణ్ వీనులవిందుగా సంగీతం అందించారన్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అని, విజయవంతం చేయాలని ప్రేక్షకులను కోరారు. నటుడు సందీప్, నిర్మాత పవన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. పాములు రావా?

- అధ్వానంగా వడ్డాది పశువుల ఆస్పత్రి
- వైద్యురాలికి పాముకాటుతో ఉలికిపాటు



పశువుల ఆస్పత్రి లోపల కూలిన శిథిలాలు



శిథిలమైన వడ్డాది పశువుల ఆస్పత్రి

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది పశువుల ఆస్పత్రి అధ్వానంగా తయారైంది. శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్తగా నిర్మించిన పశువుల ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ క్రమంలో ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు పాము కాటుకు గురి కావడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. వివరాలిలా ఉన్నాయి. వడ్డాది పశువుల ఆస్పత్రిలో విధుల్లో నిమగ్నమై ఉన్న వైద్యురాలు వాసవి పాముకాటుకు గురయ్యారు. ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో వాసవి విధులు ముగించుకుని ఇంటికెళ్లే సమయంలో ఆస్పత్రిలో రికార్డు పనులు చేస్తున్నారు. ఆమె విధులు నిర్వహిస్తున్న టేబుల్ కిందకు పాము రావడంతో అక్కడే ఉన్న సిబ్బంది చూసి పాము అని అరిచారు. ఆమె ప్రాణ భయంతో వెంటనే కింద ఉన్న కాళ్లను కుర్చీపైకి పెట్టుకుని ఉండిపోయారు. పాము వెళ్లిపోయిన తరవాత ఆమె ఊపిరి పీల్చుకుని ఇంటికి బయలు దేరారు. వడ్డాదిలో బస్సు ఎక్కి చోడవరం వెళ్లగానే ఆమె ఎడమ కాలు వాచిపోయి బరువెక్కడంతో ఆమె కంగారుపడ్డారు. ఎడమ కాలుపై రెండు గాట్లు ఉండటంతో పాము కరిచిందని గుర్తించి వెంటనే చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె భర్త వచ్చి అనకాపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం స్టీల్‌ప్లాంటు ఆస్పత్రికి తరలించారు.

ప్రారంభానికి నోచుకోని కొత్త భవనం

సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన వడ్డాది పశువుల ఆస్పత్రి శిథిలమై రెండేళ్ల కిందట పెంకులూడి సగ భాగం కూలిపోయింది. కూలిన శిథిల గది పక్క ఉన్న మరో గదిలోనే ఉంటూ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకుల కృషితో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పశువుల ఆస్పత్రి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఐదు నెలల కిందట ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా ఆస్పత్రి ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. అప్పటి నుంచి కూలిన శిథిల భవనంలోనే వైద్య సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. సగం కూలిన పెంకుల షెడ్డు శిథిలాల నుంచి వచ్చిన ఓ పాము బుధవారం విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిని కాటేసింది. కొత్తగా నిర్మించిన ఆస్పత్రిని ప్రారంభించి ఉంటే ఇటువంటి ఘటనలు పునరావృతం కావని వైద్య సిబ్బందితో పాటు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా విశాఖ డెయిరీ నిధులతో నిర్మించిన పశువుల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని కొత్త పశువుల ఆస్పత్రి

క్లుప్తంగా

పెరిగిన ఉల్లి ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లి ధర అమాంతంగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. ఎప్పటిలాగే టమాటా, బంగాళాదుంప, దొండకాయ, బెండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, చేమ దుంప, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80, పాదు చిక్కుడు రూ.వంద చొప్పున విక్రయాలు సాగాయి.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు గురువారం తెలిపారు. మామిడివాక గెడ్డ నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌కు పది వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ బొత్సకు స్వాగతం



మునగపాకలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వస్తున్న ఎమ్మెల్సీ సత్యనారాయణ

మునగపాక: ఇటీవల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు గురువారం మునగపాక మండలం వైఎస్సార్‌సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెజ్ బాధితులను పరామర్శించి అచ్యుతాపురంలోని ప్రమాదానికి కారణమైన ఫార్మా కంపెనీకి వెళుతున్న క్రమంలో భాగంగా మార్గమధ్యలో మునగపాకలోని పార్టీ కార్యాలయానికి బొత్స వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆయనకు పరిచయం చేశారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్సకు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా బంద్ రేపు

అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 24న నీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్టు జెడ్సీ ఒమ్మి అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంతో తుమ్మపాల హెడ్ వాటర్ పీఎస్‌సీ పైపులైన్లు స్థానంలో 500 ఎంఎం వ్యాసార్థం కలిగిన డీఐ పైపులైన్లు వేస్తున్నట్లు తెలిపారు. జోనల్ పరిధిలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 162 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	4,940
రెండో రకం	3,600	4,250
మూడోరకం	2,900	3,340

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏబీ పాజిటివ్-1 యూనిట్, ఏ పాజిటివ్-3, బీ పాజిటివ్-17, ఓ పాజిటివ్-20 యూనిట్లు చొప్పున శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఫ్లై ఓవర్ పూర్తయ్యేదెన్నడో...

అనకాపల్లి పట్టణవాసులకు ఇప్పట్లో ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. 15 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. బ్రిటిష్ కాలం నాటి రైల్వే అండర్ బ్రిడ్జి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఇది ఇరుకుగా ఉండటంతోపాటు వర్షం నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.

- అసంపూర్తిగా లక్ష్మీదేవిపేట రైల్వే బ్రిడ్జి
- వర్షం కురిస్తే ట్రాఫిక్ అంతరాయం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



లక్ష్మీదేవిపేట వద్ద అసంపూర్తిగా రైల్వే బ్రిడ్జి



రైల్వే స్థలంలో వేసిన పిల్లర్లు

అనకాపల్లి: పట్టణంలోని లక్ష్మీదేవిపేట రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2008లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైల్వే అధికారులు తమ పరిధిలో రూ.12 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన భాగం రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉండగా, ఇంతవరకూ ప్రారంభించలేదు.

పట్టణంలోని విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీ సమీపంలో అనకాపల్లి–చోడవరం రహదారిలో వాహన రాకపోకలు సాగించాలంటే రైల్వే అండర్ బ్రిడ్జి కీలకమైనది. ఇది బ్రిటీష్ కాలం నాటిది. అత్యంత పురాతనమైన అండర్ బ్రిడ్జి కింద నుంచే అనకాపల్లి, తుమ్మపాల, వెంకన్నపాలెం, చోడవరం, వడ్డాది, మాడుగుల, పాడేరు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు సాగుతాయి. వర్షం కురిస్తే ఇక్కడ నీరు చేరుకోవడంతో వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో లక్ష్మీదేవిపేట రైల్వే గేటు ద్వారా ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. ఆ సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికితోడు కూతవేటు దూరంలో అనకాపల్లి రైల్వే స్టేషన్ ఉండటంతో తరచూ గేటు వేయడంతో ఈ సమస్య మరింత జటిలమవుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 2008లో అప్పటి కాంగ్రెస్ హయాంలో లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. యుద్ధప్రాతిపదిక రైల్వే అధికారులు తమ పరిధిలో ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికి



రైల్వే స్టేషన్ రహదారిలో పిల్లర్

15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దాంతో రైల్వే బ్రిడ్జి నానాటికీ పాడయ్యే దుస్థితికి చేరుతోంది. ఇప్పటికైనా తక్షణమే చర్యలు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 1.6 కిలోమీటర్లు బ్రిడ్జి నిర్మించాలి

స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఇటు భీమునిగుమ్మం, రింగ్‌రోడ్డు హిమశేఖర్ కళాశాల నుంచి అటు గుండాల జంక్షన్ వరకూ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపట్టాలి. రైల్వే శాఖ పరిధిలో పనులు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 1.6 కిలోమీటర్లు ఫ్లై ఓవర్ నిర్మించాలి. వెంటనే ఈ పనులు ప్రారంభించి వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి. గతంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.35 కోట్లు ఇచ్చారు. పనులు చేపట్టకపోవడంతో ఆ నిధులు మరలా వెనక్కి పోయాయి.

తరచూ ట్రాఫిక్ సమస్య....



పదేళ్లుగా శేఖరవీధి రైల్వే స్టేషన్ రహదారిలో నివసిస్తున్నాం. అప్పటికే బ్రిడ్జి పిల్లర్ వేసి ఉంది. ఫ్లైఓవర్ పనులు ఎప్పుడు చేస్తారో అర్థం కావడం లేదు. రైల్వే స్టేషన్ రహదారిలో రోడ్డుకు అడ్డంగా పెద్ద పిల్లర్ వేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.

– ఎం.సత్తిబాబు, రైల్వే స్టేషన్ రహదారి, అనకాపల్లి

రూ.54 కోట్లతో ప్రతిపాదన

ఫ్లైఓవర్ నిర్మించాలంటే రూ. 54 కోట్లు ఖర్చవుతుంది. ఈ మేరకు గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఇంతలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో నిధుల కోసం ఎదురు చూస్తున్నాం. వచ్చిన వెంటనే త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.

–కె.ఎస్.ప్రభు, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ అనకాపల్లి

స్కేటింగ్‌లో కశింకోట విద్యార్థులకు పతకాల పంట



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన స్కూలు విద్యార్థులు

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థులు ఇంటర్ స్థాయి స్కేటింగ్ పోటీలో ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. 21 మందికి బంగారు, వెండి, కాంస్య పతకాలు లభించాయి. విశాఖలో ఇటీవల యూనిక్యూ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ ఇంటర్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సెయింట్ జాన్స్ స్కూలు నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో ఏడుగురికి బంగారు, 8 మందికి వెండి, ఆరుగురికి కాంస్య పతకాలు లంభించాయి. వీరిని స్కూలు ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కోచ్ కె. రవికుమార్, ఉపాధ్యాయ, సిబ్బంది గురువారం అభినందించారు.

నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా సురేంద్ర



నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా విశాఖ జీవీఎంసీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జె.సురేంద్రను నియమిస్తూ మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింగల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కమిషనర్ పూడి రవిబాబును మున్సిపల్‌శాఖ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో సురేంద్ర నర్సీపట్నం కమిషనర్‌గా పని చేశారు.



వర్షానికి చిత్తడిగా బస్సు స్టేషన్

చిత్తడిగా బస్సుస్టేషన్

వర్షంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



కురుస్తున్న వర్షం

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. దట్టంగా మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా వర్షం పడింది. దాంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షానికి కశింకోటలోని బస్సు స్టేషన్ ప్రాంగణం చిత్తడిగా మారింది. దీంతో బస్సులు



జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు

సరిగా బస్సు స్టేషన్‌కు రాకపోవడంతో ప్రయాణికులు బయట రోడ్డు మీదకు వెళ్లి గమ్యాలకు చేరాల్సిన పరిస్థితి ఎదుర్కొన్నారు. అలాగే జాతీయ రహదారి, పల్లపు ప్రాంతాల్లో నీరు ప్రవహించింది. వరుణుడి కటాక్షం కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో మోస్తరుగా కురిసిన వర్షంతో ఆనందం వ్యక్తం చేశారు. వర్షం వరి నాట్లకు ఉపకరిస్తుందని తెలిపారు.

జ్యువెలరీ డిజైనింగ్‌కు సాంకేతికత అవసరం

వృత్తి నైపుణ్య శిక్షకురాలు జ్యోతి కొఠారి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి కొఠారి

అనకాపల్లి: జ్యువెలరీ డిజైనింగ్‌కు సాంకేతిక నైపుణ్యం అవసరమని ముంబాయికి చెందిన జ్యువెలరీ డిజైనర్, వృత్తి నైపుణ్య శిక్షకురాలు జ్యోతి కొఠారి అన్నారు. గురువారం స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 'జ్యువెలరీ డిజైనింగ్' పై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యువెలరీ డిజైన్ సృజనాత్మకత మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఆభరణాల రూపకల్పన అనేది సృజనాత్మక కళ అన్నారు. డిజైనర్ ప్రతిభ, నైపుణ్యాలను బట్టి ఆదాయం సమకూరుతుందన్నారు. ఒక సాధారణ ఫ్రీలాన్స్ జ్యువెలరీ డిజైనర్ నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించవచ్చని సూచించారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఔత్సాహికుల అభిరుచుల మేరకు గ్రంథాలయం ఆధ్వర్యంలో మరిన్ని వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. జ్యువెలరీ డిజైనర్ కావడానికి అండర్ గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కోర్సును ప్రతి ఒక్కరూ అభ్యసించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు కర్రి శివ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, వృత్తి నైపుణ్య శిక్షకురాలు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

గిరినాగు పట్టివేత



గిరి నాగును పట్టుకుంటున్న వెంకటేష్

చీడికాడ: మండలంలో వీరభద్రుపేటలో కల్యాణ మండపం చుట్టూ రైతులు తుప్పలు, డొంకలు గురువారం కొడుతుండగా 13 అడుగుల గిరినాగు కనపడింది. దీంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్నేక్ క్యాచ ర్ వెంకటేష్, వారి బృందం గంట సేపు శ్రమించి, గిరినాగును పట్టి బంధించారు.

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం

కోట్ని వీధిలో సందడిగా సాంస్కృతిక ప్రదర్శనలు



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



జాతరలో శక్తివేషాలు



అమ్మవారి జాతరలో నేలవేషాలు

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కోట్నివీధి పురవీధులు గుండా ఊరేగించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమంలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణచంద్రహరినాథ్, ధర్మకర్తలు ఇల్లపు వెంకటరమణ, నగిరెడ్డి మధు, కోరుకొండ సంతోష్, ఇల్లపు జయశంకర్, గొర్లి రమణమ్మ, వీధి పెద్దలు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేడ్కర్

నక్కపల్లి: ప్రతి రైతు కచ్చితంగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని నక్కపల్లి తహసీల్దార్ అంబేడ్కర్, మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. గురువారం మండలంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పొందే రాయితీ విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సెప్టెంబరు 15వ తేదీ లోపు ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పంట వేసిన ప్రతిసారి కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు నమోదు చేయాలన్నారు.

పడగ విప్పిన వైరల్ జ్వరాలు

రోగులతో నిండిపోయిన ప్రభుత్వాస్పత్రి



మాడుగుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

మాడుగుల : ఏజెన్సీకి ముఖ ద్వారమైన మాడుగుల మండలంలో వైరల్ జ్వరాలు పడగ విప్పాయి. మండలంలో గల 29 పంచాయతీల్లో జ్వరపీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. ఆసుపత్రిలో జనరల్ వార్డులు, చిన్నపిల్లల వార్డులు జ్వర పీడితులతో నిండిపోయాయి. రోజుకు 120 నుండి 200 వరకూ జ్వరాలతో ఆస్పత్రికి వస్తున్నారు. జ్వర తీవ్రత అధికంగా ఉన్నవారిని ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం అందిస్తున్నారు. రక్త పరీక్షలు నిర్వహించిన వారికి మలేరియా, టైఫాయిడ్‌లు, నెగిటివ్ అని రిపోర్టులు వస్తున్నాయి. కానీ జ్వరాలు మాత్రం వారం రోజుల వరకు తగ్గుముఖం పట్టలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. గురువారం కూడా సుమారు 200లకు పైగా మాడుగుల 30 పడకల ఆసుపత్రి జ్వరాలతో రోగులు వచ్చారు. ఈ విషయమై వైద్యాధికారి సంతోష్ కుమార్‌ను సంప్రదించగా ఏజెన్సీ గ్రామాలు కూడా మాడుగుల ఆసుపత్రిపై ఆధారపడి ఉండడంతో వైరల్ జ్వరాలు తీవ్రత అధికంగా ఉండడం వాస్తవమేనని, ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కాచి చల్లార్చిన నీరు తాగడం వల్ల జ్వరాలు అదుపు చేయవచ్చన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన బైక్

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వాడ్రాపల్లికి చెందిన కర్రి రవికుమార్ గురువారం ఉదయం బైకుపై డీజిల్ తీసుకొచ్చేందుకు అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట పెట్రోల్ బంక్‌కు వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు వెళ్తున్న ఆటో ఆయనను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రవికుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తాచేరు, శారద నదులకు జలకళ



తారకరామ జలాశయంలో చేరిన నీరు

మాడుగుల రూరల్ : వాతావరణంలో ఏర్పడిన మార్పులతో గురువారం మధ్యాహ్నం నుంచి ఒక మోస్తరుగా వర్షం కురిసింది. దీంతో తాచేరు, శారద నదుల్లో భారీగా నీరు చేరింది. దీంతో పాటు జలాశయాల్లో వర్షపు నీరు చేరుతోంది. మండలంలో పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, పాలగెడ్డ, జలాశయాల్లో నీరు చేరడంతో సాగునీటి అవసరాలకు నీరు ఉపయోగపడుతుంది. దీంతో పాటు బుధవారం రాత్రి కూడా ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఈ వర్షంతో ఇటు ఖరీఫ్ వరినాట్లకు, అటు చెరకు దవ్వనాట్లకు ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. గురువారం ఉదయం వరకు 2.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని తహసీల్దారు పి.వి.రత్నం తెలిపారు.

గెడ్డ భూమిలో హెచ్చరిక బోర్డులు

మాకవరపాలెం: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని 68 సర్వే నంబర్‌లో గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని, నిర్మాణాలు చేసేందుకు సిద్ధం చేస్తున్నారంటూ స్పందనలో ఫిర్యాదు చేయడంతోపాటు హై కోర్టులో పబ్లిక్ ఇంట్రస్ట్ లిటికేషన్(పిల్) దాఖలైంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం 68 సర్వే నంబర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ఖాళీ స్థలంతోపాటు మరోచోట ఖాళీగా ఉన్న స్థలంలో వీఆర్వో లక్ష్మణరావు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

శాంతి ర్యాలీ, మానవహారం

పాయకరావుపేట: పట్టణంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, సంస్థ సభ్యులు గవర్నమెంట్ జూనియర్ కాలేజి నుంచి సూర్యా మహల్ సెంటర్ వరకు ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ శాంతి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. 2004లో ఎస్.రామచంద్రారెడ్డి జంగారెడ్డిగూడెంలో 108 మంది సభ్యులతో మానవత స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైంది. నేటికి రాష్ట్ర వ్యాప్తంగా 120 శాఖలతో 80 వేల మంది సభ్యులతో అభివృద్ధి పథంలో నడుస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఓ పేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందించినట్లు సంస్థ మండల శాఖ చైర్మన్ బాలేపల్లి చినబాబు, టెక్కలి వెంకట రామకృష్ణ తెలిపారు. ఈ ర్యాలీలో సంస్థ సభ్యులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, జగతా శ్రీనివాస్, వెలుగుల అర్జునరావు, పెదిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో ఇక్కట్లు



రామన్నపాలెంలో మెయిన్ రోడ్డు దుస్థితి

కోటవురట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు దారుణంగా తయారయ్యాయి. రోడ్లు కోరుకుపోయి పెద్ద గోతులు పడ్డాయి. వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరి అంచనా తెలియక వాహనచోదకులు ప్రమా దాల బారిన పడుతున్నారు. చీకట్లో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రామన్నపాలెం, అన్నవరం, గొట్టివాడ గ్రామాలకు వెళ్లే రహదారులు పలు చోట్ల శిథిలమయ్యాయి. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.